క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిక



సమిశ్రగూడెంలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం గ్రామానికి చెందిన యువకులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. సమిశ్రగూడెం వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ ఆధ్వర్యంలో యువకులు వైఎస్సార్ సీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు ఆహ్వానించారు. గ్రామానికి చెందిన ఖండవల్లి రాజు, పసలపూడి రామకృష్ణ, ఆరుగొలను యువరాజు, ముప్పిడి జైపాల్, కొక్కిరపాటి బాబుతో పాటు మరికొంత మంది యువకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కస్తూరి సాగర్, షేక్ రహీం, కొత్తపల్లి సత్యనారాయణ, దేశాబత్తుల నాగు, వడలి అంబేడ్కర్, గెద్దం రవీంద్రబాబు, కొల్లి రాజు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న సంపూర్ణ పోషణ పథకం

నల్లజర్ల: బాలింతలు, గర్భిణులు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలిస్తోందని గోపాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి వై.బి.టీ.సుందరి చెప్పారు. మండలంలోని గంటావారిగూడెం -67వ నంబరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో సీడీపీఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజమే లక్ష్యంగా అనేక పథకాలు అమలవుతున్నాయని, ఇందులో భాగంగానే బడి ఈడు పిల్లల కోసం పాఠశాలల్లో పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తుండగా, మహిళల ఆరోగ్యం కోసం అదే తరహాలో కృషి చేస్తున్నట్టు చెప్పారు. గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్డుకు అదనంగా మరిన్ని పోషక పదార్థాలను అందించడంతో రక్తహీనత తగ్గుతోందన్నారు. పోషకాహారం టేక్ హోమ్ రేషన్ సదుపాయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ వి.పద్మావతి, సూపర్‌వైజర్ హారతి, ఎంపీహెచ్ఏ సువర్ణకుమారి, మహిళా సంరక్షణ కార్యదర్శి కె.వి.యస్.దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు హాజరయ్యారు.

వైభవంగా కేశవస్వామి కల్యాణోత్సవం

ఉండ్రాజవరం: శ్రీదేవి, భూదేవి సహిత శ్రీకేశవ స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అమ్మ వారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, రాత్రి స్వామి వారికి అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి 10 గంటలకు అర్చకులు చక్రవర్తుల శేషాచలం ఆధ్వర్యంలో శ్రీస్వామి వారికి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు, కార్యనిర్వహణాధికారి మీసాల వెంకట్రావు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మదనగోపాలస్వామి కల్యాణోత్సవం

తాళ్లపూడి: వివాహాల దేవుడు, సంతాన మదన గోపాలుడిగా ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం రాత్రి తాళ్లపూడిలో వైభవంగా నిర్వహించారు. పరస వంశీకులు వంశపారం పర్యంగా ఈ కల్యాణం నిర్వహిస్తున్నారు. పరస వంశస్తులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం నిర్వహించారు. వేద పండితులు పెదిటి శ్యామ్, ఆలయ అర్చకులు గోవర్ధనం మదనగోపాల్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మదనగోపాలస్వామిని, ఆలయాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి జనార్దనరావు, అప్పన రాజా, కంకిపాటి సాయి, బొర్రా శ్రీరామచంద్రమూర్తి, పురాణ ఉపన్యాసకులు పరస రాధాకృష్ణ, సాలస ఉమా పాల్గొన్నారు.

27న ఎస్ఈబీ స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనాల వేలం

దేవరపల్లి: దేవరపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర (బైక్) వాహనాలను స్టేషన్ వద్ద ఈ నెల 27న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు సీఐ కేవీ స్వామి బుధవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, రూ.5 వేలు ధరావత్తు స్టేషన్ వద్ద చెల్లించాలని, పాట దక్కించుకున్న వారు వేలం సొమ్ముతో పాటు జీఎస్టీ కలిపి చెల్లించాలని ఆయన తెలిపారు. వివరాల కోసం దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ వద్ద సంప్రదించాలని తెలిపారు.

22న గోపవరంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

నిడదవోలు రూరల్: గోపవరంలో ఈనెల 22న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జేపీ రూఢీ బుధవారం తెలిపారు. సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివాజీ పర్యవేక్షణలో స్పెషలిస్ట్ వైద్యులు రోగులను పరీక్షించి వైద్యసేవలందిస్తారని ఆమె పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ వెలుగు

- 200 యూనిట్ల వరకు రాయితీ ఇస్తున్న ప్రభుత్వం
- నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీలకు రూ.కోట్లలో లబ్ధి
- టీడీపీ హయాంలో నామమాత్రంగా రాయితీ



నిడదవోలు విద్యుత్ సబ్‌స్టేషన్

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీల ఇళ్లల్లో విద్యుత్ వెలుగులు విరాజిల్లుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కోరి అనేక పథకాలను ప్రవేశపెట్టింది. ఎస్సీ, ఎస్టీల ఇళ్లల్లో విద్యుత్ కాంతులు నింపాలనే ఉద్దేశంతో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామనే హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నారు.

200 యూనిట్లలోపు ఉచితం

నిడదవోలు నియోజకవర్గంలో 75% మంది ఎస్సీ, ఎస్టీలు నిరుపేదలే. కాయ కష్టం చేసుకుంటూ జీవిస్తున్నారు. నెలకు 200లోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ ఇస్తోంది. గతంలో కొంతమందికి విద్యుత్ సౌకర్యం ఉండేది కాదు. బిల్లులు చెల్లించే స్తోమత లేక విద్యుత్ కనెక్షన్ తీసుకునేవారు కాదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఉచిత విద్యుత్‌తో పాటు రాయితీపై కనెక్షన్ ఇస్తున్నారు. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ప్రభుత్వం బిల్లులు రద్దు చేసింది. టీడీపీ హయాంలో కేవలం 100 యూనిట్లు మాత్రమే రాయితీ ఇచ్చేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ రాయితీని 200 యూనిట్లకు పెంచింది. నిడదవోలు విద్యుత్ సబ్ డివిజన్‌లో ఈ నాలుగున్నరేళ్లలో ఎస్సీలు 55,046 మంది, 1,417 మంది ఎస్టీలకు ఈ పథకం వల్ల లబ్ధి చేకూరింది. సంబంధిత విద్యుత్ సంస్థలకు రాయితీ బిల్లులు ప్రభుత్వం జమ చేస్తోంది.

2019 నుంచి నిడదవోలు సబ్ డివిజన్‌లో ఎస్సీలు పొందిన లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	రాయితీ (కోట్లలో)
2019–20	11,314	1.92
2020–21	11,465	1.47
2021–22	11,803	3.75
2022–23	10,001	3.71
2023–24 (ఫిబ్రవరి)	10,463	3.39

2019 నుంచి నిడదవోలు సబ్ డివిజన్‌లో ఎస్టీలు పొందిన లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	రాయితీ (కోట్లలో)
2019–20	283	4.37
2020–21	287	4.77
2021–22	291	5.84
2022–23	270	6.79
2023–24 (ఫిబ్రవరి)	286	7.23

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



టీడీపీ హయాంలో విద్యుత్ బిల్లు నెలకు రూ.250 నుంచి రూ.300 వరకు వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత 200 యూనిట్లలోపు వాడిన వారికి ఉచిత విద్యుత్ పథకం వర్తింపజేశారు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– పెంటగంటి చిట్టెమ్మ, చర్చిపేట, నిడదవోలు

నాలుగున్నరేళ్లలో పైసా చెల్లించలేదు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు కరెంటు బిల్లుకు నేను పైసా కూడా చెల్లించలేదు. 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు వాడుకుంటున్నాం. కుల ధ్రువీకరణ పత్రం సమర్పించిన వెంటనే రాయితీతో కొత్త కనెక్షన్ ఇస్తున్నారు.

– పోలుమాటి సుగునమ్మ, చర్చిపేట, నిడదవోలు

ఎస్సీ, ఎస్టీలకు ఎంతో మేలు



రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఉచిత విద్యుత్ పథకం ఆయా వర్గాల వారికి ఎంతగానో మేలు చేకూరుస్తోంది. వారు వినియోగించే విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే భరిస్తోంది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్న ఎస్సీ, ఎస్టీలకు ఎంతో మేలు చేశారు

– మానుకొండ చంద్రబాబు, తాడిమళ్ల

ఉచిత విద్యుత్ పథకం హర్షణీయం



ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చిన సీఎం జగనన్న దళితుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. చాలా మంది దళితులు కాయ కష్టం చేసుకుని బతుకుతున్నారు. కూలి పనులు చేసుకుని జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయడం హర్షణీయం.

– విపర్తి, కిషోర్, నిడదవోలు

వైఎస్సార్ సీపీ ద్వారానే పేదల అభ్యున్నతి

- ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్
- అందుబాటులో ఉంటా ఆశీర్వదించండి : తలారి



కాపవరంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ అధికారంలో రావడం ద్వారానే పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిపించాలని రాజమహేంద్రవరం పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ కోరారు. కాపవరంలో బుధవారం సాయంత్రం ప్రజా ఆశీర్వాదం పేరుతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరి శ్రీనివాస్ ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మేలుని గుర్తు చేశారు. రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానాన్ని బలహీన వర్గానికి చెందిన తనకి కేటాయించడం బీసీలంతా గర్వించదగిన విషయం అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. నిత్యం ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని తలారి వెంకట్రావు కోరారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, సర్పంచ్ సుంకర పద్మిని, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, వెంపాటి సురేష్, కంఠమణి రమేష్, తోట రామకృష్ణ, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిన భవానీ ప్రియా, కొయ్య దుర్గారావు, కవల నాగేశ్వరరావు, చొప్పా అప్పలనాయుడు, గుర్రే శరత్, సూర్ల నగేష్, గుబతాల సురేష్ పాల్గొన్నారు.

బీసీ వర్గాలు వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాలి



చాగల్లులో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు

చాగల్లు: రాష్ట్రంలో గడిచిన ఐదేళ్ల కాలంలో బీసీ వర్గాలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ విజయానికి వచ్చే ఎన్నికల్లో బీసీలు కృషి చేయాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. చాగల్లులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బీసీ సంఘం నాయకులు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, బీసీ నాయకులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయానికి నాంది పలికి బీసీ వర్గాలకు అధిక సీట్లు కేటాయించిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావును భారీ మెజార్టీతో బీసీలందరూ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బొర్రా కృష్ణారావు, ఎంపీటీసీ సానబోయిన అర్జునరావు, వీరవల్లి సత్యనారాయణ, రాఘవమ్మ, కే హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మూడవ రోజు 'పది' పరీక్ష

దేవరపల్లి: దేవరపల్లి మండలంలో ఐదు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పదవ తరగతి మూడవ రోజు బుధవారం ఇంగ్లిషు సబ్జెక్టు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవోలు ఎం. తిరుమలదాస్, కేఆర్ఎస్ఎస్‌వీపీ అప్పారావు తెలిపారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో 963 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా, 916 మంది పరీక్షకు హాజరైనట్టు తిరుమలదాస్ తెలిపారు. దీనిలో రెగ్యులర్ విద్యార్థులు 933 మందికి 910 మంది, సప్లమెంటరీ విద్యార్థులు 30 మందికి ఆరుగురు పరీక్ష రాసినట్టు ఆయన తెలిపారు. రెగ్యులర్, సప్లమెంటరీ విద్యార్థులు మొత్తం 47 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ఆయన వివరించారు.

ఇంగ్లీషు పరీక్షకు 118 మంది గైర్హాజరు

నల్లజర్ల: పదో తరగతి పరీక్షలకు సంబంధించి మూడో రోజు ఇంగ్లీషు పరీక్షకు 1,144 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,026 మందే హాజరైనట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు.

43 మంది గైర్హాజరు

చాగల్లు: చాగల్లు మండలం పరిధిలో బుధవారం నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు 43 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో వి.ఖాదర్‌బాబు తెలిపారు. మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు 423 విద్యార్థులు మంది హాజరు కావాల్సి ఉండగా 380 మంది హాజరైనట్టు ఎంఈవో తెలిపారు.

ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలి

డీఎస్పీ కేసీహెచ్ రామారావు



డీఎస్పీ కేసీహెచ్ రామారావు

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి పౌరుడు తన ఓటు హక్కుని ధైర్యంగా వినియోగించుకునేందుకు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు కేంద్ర పోలీసు బలగాలను వినియోగిస్తున్నామని డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. కొవ్వూరు సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగడానికి ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల్లో కోడ్ అమలు ఉన్నందున రాజకీయ పార్టీలు సభలు, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. తాత్కాలిక పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, లౌడ్ స్పీకర్లు వినియోగానికి, సభల్లో స్పీకర్ల వినియోగానికి, వీధి సమావేశాలు, ఇంటింటి ప్రచారం, కరపత్రాలు పంపిణీ, ఊరేగింపులకు అనుమతి తీసుకోవాలని సూచించారు. వాహనాల వినియోగానికి అనుమతి, జెండాల ఏర్పాటు, ర్యాలీలు, పాదయాత్రలు, ఆటోల ద్వారా ప్రచారాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి, పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఇతర కులాలను, మతాలను కించ పరిచే విధంగా ప్రసంగించకూడదు. ప్రార్థన మందిరాలు, చర్చిలు, ఆలయాల వద్ద, పాఠశాలలు, విద్యా సంస్థల, ఆసుపత్రి సమీపంలో వంద గజాలలోపు స్పీకర్లను వినియోగించవద్దని అన్నారు. రూ.50 వేలు పైబడి నగదు తరలిస్తే కచ్చితంగా వివరాలు, ఆధారాలు చూపించాల్సి ఉంటుందన్నారు. వాహనాల తనిఖీకి గోపాలపురం, ఉండ్రాజవరం, నల్లజర్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

భగవంతుడి సేవే మహాభాగ్యం



లింగంపల్లిలో దుర్గమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

పెరవలి: భగవంతుని సేవ చేయటమే మహాభాగ్యమైతే అందులో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని సీతారాముల వారికి సేవ చేయటం తన పూర్వజన్మ సుకృతమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. పెరవలి మండలం ఖండవల్లి శెట్టిబలిజ రామాలయంలో సీతరాముల వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌నాయుడు కుమారుడు వరుణ్ సాయి, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ రామగుడుల సూర్యనారాయణ, శెట్టిబలిజల సంఘ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు పూజలు

నిడదవోలు రూరల్: నిడదవోలు పట్టణ శివారు లింగంపల్లిలో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, ఆయన తనయుడు వరుణ్‌సాయి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల రామారావు, జక్కంశెట్టి రాకేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి



ఎస్ రాజీవ్‌కృష్ణను కలిసిన చాగల్లు మండల వైఎస్సార్ సీపీ నాయకులు

చాగల్లు: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు ఎస్ రాజీవ్‌కృష్ణను చాగల్లు మండల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన అనంతరం ఆయన కొవ్వూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో మండల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావు విజయానికి రాజీవ్‌కృష్ణ సారథ్యంలో కష్టపడి పని చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యులు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్. పార్టీ సీనియర్ నాయకులు లకంసాని సూర్యప్రకాశరావు, ఎంపీటీసీలు పిల్లి తిరుమలరావు, సర్పంచులు మద్దుకూరి రవి, గురువెల్లి కుమారి, గుమ్మడి శైలేంద్రరావు, బండి అశోక్, జాలెం వెంకట్రావు, మారిశెట్టి సత్తిబాబు, మద్దిపాటి కొదాండ రామ్, చిక్కం నర్సింహమూర్తి, గెద్దం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ కృష్ణకు అభినందనలు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్ కృష్ణను కొవ్వూరులో బుధవారం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకట లక్ష్మి,పరిమి హరిచరణ్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గుమ్మడి శైలేంద్రరావు, వైఎస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, చాగల్లు ఎంపీపీ మట్టా వీరస్వామి, కొమ్మిరెడ్డి పరశు రామారావు, గనిశెట్టి బంగార్రాజు, నామా శ్రీనివాస్, కొలిశెట్టి సత్యనారాయణ, గారపాటి శ్రీనివాసరావు, గారపాటి వెంకటకృష్ణ, యాళ్ల బాబూరావు, వేములపల్లి గోపి, పరిమి సోమరాజు, పరిమి వెంకట్రావు, మలకపల్లి ఎల్ఏసీఎస్ అధ్యక్షుడు కుంటముక్కల కేశవనారా యణ, నక్కా చిట్టిబాబు, గెద్దం సూర్యారావు, వల్లభశెట్టి శ్రీహరి, గుడా విజయరాజు, లకంసాని సూర్యప్రకాశరావు, బల్లిపాడు సర్పంచ్ శివరా మకృష్ణ, దారవరం సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్, మారిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలకు వర్షంతో మేలు



అన్నవరప్పాడులో కురుస్తున్న వర్షం

పెరవలి: వాతావరణ శాఖ చెప్పినట్లుగానే బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. పెరవలి మండలంలో కురిసిన వర్షం వల్ల మెట్ట ప్రాంతంలోని పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఎండలకు ఎండిపోతున్న వాణిజ్య పంటలకు ఈ వర్షంతో ఎంతో ఉపయోగపడుతుందని, ఈనిక దశలో ఉన్న దాళ్వా వరి చేలకు ఉపయుక్తంగా ఉంటుందని రైతులు అన్నారు. హఠాత్తుగా కురిసిన వర్షం వల్ల ఇటుక బట్టీల యజమానులు ఆందోళన చెందారు. ఆరబెట్టిన ఇటుకలు తడిసి ముద్దయ్యాయని వారన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా సాయంత్రానికి మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. ముఖ్యంగా అరటి, కూరగాయల పంటలకు, పాదులకు కొబ్బరి, కోకో తోటలకు ఎంతో వర్షంతో ఉపయోగం ఉంటుందని రైతులు అన్నారు.

ఉండ్రాజవరం: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మండలంలో బుధవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఎండలతో అవస్థలు పడుతున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం కలిగింది.

కొవ్వూరులో చిరు జల్లులు

కొవ్వూరు: వారం రోజుల నుంచి వేసవి ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతున్న తరుణంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. బుధవారం సాయంత్రం నియోజకవర్గం వ్యాప్తంగా చిరుజల్లులు కురిశాయి.

పెద్దేవంలో 'మేము సిద్ధం- మా బూత్ సిద్ధం'



పెద్దేవంలో మేము సిద్ధం- మా బూత్ సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవంలో బుధవారం మేము సిద్ధం- మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో బూత్ కమిటీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గ వైఎస్సార్ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకటరావు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, మైలవరపు రాధాకృష్ణ, కోడి గంగారావు, యండపల్లి సత్యనారాయణ, బట్టు సుబ్బారావు, గృహసారథులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌కు ఘన సత్కారం

గోపాలపురం: గోపాలపురం ఉపసర్పంచ్‌గా ఎంపికైన వింత అమర ప్రసాద్‌రెడ్డిని మండల వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం సత్కరించారు. గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వర్తక సంఘం అధ్యక్షుడిగా ఉంటూ గోపాలపురం మేజరు పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఎంపికైన ప్రసాద్‌రెడ్డి సేవలు అభినందనీయమన్నారు. నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ ఆచంట సురేష్, మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, వెలగా శ్రీరామమూర్తి, సాలి వేణు, ముల్లంగి శ్రీనివాస రెడ్డి, గోపాలపురం వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అనుసరించాలి

గోపాలపురం: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దేవరపల్లి సీఐ కె.బాలసురేష్ అన్నారు. గోపాలపురం మండలం భీమోలు, దొండపూడి, కొవ్వూరుపాడులో బుధవారం కేంద్ర సాయుధ పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్పీ కె జగదీష్ ఆదేశాల ప్రకారం సమస్యాత్మక, అతి సమస్మాత్మక గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పోలీసులకు సహకరించాలని సీఐ సురేష్ కోరారు. ఈకార్యక్రమంలో గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

నల్లజర్ల: దూబచర్లలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గ్రంధి జయలక్ష్మికి రూ.4వేలు, యంత్రపాటి బ్రహ్మయ్యకు రూ.4 వేలు మండల మానవత సంస్థ సాయంగా బుధవారం అందజేసింది. ఈ కార్య క్రమంలో మండల మానవత చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు, అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, డైరక్టర్ దావులూరి చిరంజీవి, గ్రామ కన్వీనర్ కూచిపూడి ఉదయభాస్కరావు, సభ్యులు తాతిన దొరబాబు, అప్పసాని రామకృష్ణ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: పాత గొడవల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడిచేసిన ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ బుధవారం తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెం గ్రామానికి చెందిన పాతగొలుసు నిమ్మి, చీపుళ్ల ప్రసన్నకుమార్, బొబ్బిల ప్రభాస్ ఈనెల 19వ తేదీ రాత్రి గొడవ పడి చాకులు, రాడ్డులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దోమల నివారణకు చర్యలు

నల్లజర్ల: దోమల నియంత్రణకు ప్రతి ఇంటా చర్యలు చేపట్టాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు సూచించారు. బుధవారం నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలోని జగన్నాథపురం, దూబచర్లలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. గృహ సందర్శనలో భాగంగా దోమల ద్వారా వ్యాప్తి చెందు వ్యాధులను, డ్రైడే ప్రాముఖ్యత ప్రజలకు వివరించారు. వారానికి ఒక సారి ఇళ్ల వద్ద పరిశుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు సుహాసిని, నాగరాజ్యం, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు జమీర, సాహిత్య, ఆశ కార్యకర్తలు నాగరత్నం, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.